# తల తిరుగుడు

—గొల్లపల్లి జయబాబు

వాళ్ళ నాన్నతో కలిసి కాలేజి ఆవరణలోకి అడుగు పెట్టిన వి. సుబ్బారావుకి అక్కడి వాతావరణం, రంగు రంగుల చీరలు, ఆ హడావుడి అదీ చూసేసరికి తెల్ల బోయి తలదిరిగినట్లయింది. అది చూసిన సుబ్బారావు తండ్రి అంటే సదరు వి. రాజారావుగారు "ఏవిరా! తలతిరుగుతోందా వెధవ తలతిక్క వేషాలెయ్యకు, బుద్ధిగా చదువుకొని పైకిరా లేకపోతే తల పగులు తుంది" అన్నారు. సుబ్బారావుకి కించిత్తు కోప మొచ్చిందే. ఎదురు తిరుగుదామనుకున్నాడు. కాని తలతో వ్యవహారం మంచిదికాదని అప్పటికి ఊరు కున్నాడు. అసలు సుబ్బారావు, ముందు అబ్బాయిలు అమ్మాయిలు ఉన్న కాలేజీలో చదవను. కేవలం అబ్బాయిలున్న కాలేజీలోనే చదువుతానన్నాడు. అది విన్న రాజారావుగారు కోపమొచ్చి 'ఇలాగయితే నువ్వేం బాగుపడతావురా! తలతిక్క వేషాలెయ్యకు' అంటూ కేకలేసి కావాలని 'అబ్బాయిలు, అమ్మాయిలు' వున్న కాలేజీలోనే చేర్పిస్తూ నాకడుపున చెడబుట్టావురా తలతిరుగుడు వెధవ' అని తిట్టుకున్నారు. ఇలా తిట్టుకోవటం రెండవసారి.

మొదటిసారి

సుబ్బారావు పుట్టగానే అందరిలా కేర్‌మని అరవ లేదు. ఓసారి మూలిగి రెండుసార్లు తల అటూయిటూ ఆడించాడు. కాస్సేపటికైనా ఓ ఏడుపు ఏడుస్తాడు అని రెండు నిముషాలు ఎదురుచూసిన రాజారావుగారు 'యిక వీడు ఏడవడు' అని నిర్ధారణచేసుకొని 'వీడు నాకడుపున చెడబుట్టాడు. తలతిరుగుడు వెధవ' అన్నారు. అదివిన్న వాళ్ళమ్మ తెల్లపోయి 'ఏమిటండీ ఆ మాటలు ఎవరయినా వింటే నవ్విపోతారు' అంటూ మంగళసూత్రాన్ని తొందరగా కళ్ళకద్దుకుంది.

ముందొకసారి అంటే సదరు సుబ్బారావు నిక్కర్లలోంచి పేంట్లలోకి మారి హైస్కూలు కాం పౌండు యింకా దాటకమునుపు ఓసారి క్షవరం చేయించుకుందామనుకున్నాడు. ఆ ఆస్థాన మంగలి మొదట సుబ్బారావుని ఆ తర్వాత అతని తలనిచూసి తెల్లబోయి సర్దుకుంటూ కించిత్తు కోపంతో యింతకు ముందు ఎక్కడ చేయించుకున్నారు సార్. బంగారం లాంటి క్రాపుని పాడుచేశాడు కదండీ, హీరో పర్స నాలిటీవున్న మీకు ఈ బోడిక్రాపా?" అన్నాడు. 'నువ్వేకదటోయ్' అని అందామనుకున్నాడు. కాని అతన్ని, అతని చేతిలోఉన్న కత్తినిచూసి ఎందుకయినా మంచిదని వూరుకున్నాడు. ఇదదనుగా తీసుకుని 'ఉండండి సార్! చూసేవాళ్ళకి తలతిరిగిపోవాల అట్లాచేస్తే' అంటూ సుబ్బారావు తలని ఓగంట అటూ యిటూ తిప్పుతూ కసరత్తు చేయించాడు. 'ఇప్పుడు చూసుకోండి సార్' అంటూ త్రిభుజాకారంలో వున్న ఓ అద్దంముక్కని సుబ్బారావుచేతిలో పెట్టాడు. కాస్సేపు వెతికినా తనమొహం ఎక్కడా అందులో కనబడక పోయేసరికి "బాగానే వుండివుంటుందిలే" అని సరిపెట్టుకొని ఓ పావలా ఎక్కువిచ్చి యిల్లు చేరాడు. సుబ్బారావుని ముందుగా చూసిన వాళ్ళమ్మ సినిమాటిక్‌గా ఒక కేకవేసి రాజారావుగారిని పట్టు కుంది. ఆయనకూడా కేకవేయబోయి ఎక్కడోచూసి నట్లనిపించి పరికించి ఓనిముషం చూశాడు. పోల్చు కున్నాక కోపంతో 'ఏరా తలమాసిన వెధవ!

నీకు క్షవరంచేసిన ఆ తలలేనివెధవ ఎవడ్రా? తలేమయినా తిరుగుతోందా? ఈ సారి యిలాంటి తలతిక్క వేషాలు వేశావంటే గుండుగీయిస్తాను జాగ్రత్త' అంటూ తలవాచేలా చివాట్లువేశారు. సుబ్బారావుతల్లి కళ్ళొత్తుకుంది. సుబ్బారావు బిక్కమొహం వేసాడు. ఇది గతం.

ప్రస్తుతం కాలేజీలో చేరిన సుబ్బారావుకి అంతా వింత అనిపించింది. ఎటుచూసినా అందమయిన అమ్మాయిల విగ్రహాలే. తట్టుకోలేక నాన్నచెప్పినట్లు తలతిక్క వేషాలెయ్యకపోతే ఓ పేరూ అదీ ఉండదని, ఏదయినా మంచిపని ఒహటి చేద్దామని వాళ్ళక్లాసులో వెనక బెంచీలో కూర్చుని కునికిపాట్లుపడే లక్ష్మీకాంతమ్మని ప్రేమించడం మొదలెట్టాడు. ఆమె నిద్రపోతే తను నిద్రపోతూ, ఆమె కునికిపాట్లు పడుతుంటే తనూ కునికిపాట్లు పడుతూ అనుక్షణం ఆమె నిద్రలో మెసులుతూ వచ్చాడు. ఇదిచూసిన మాష్టారు 'ఏవిటోయ్ సుబ్బారావు! తలేమయినా తిరుగుతోందా?' అన్నారు. క్లాసంతా ఘొల్లుమంది. సుబ్బారావుకి కోపమొచ్చింది. అంతలో ఓ పదిపైసలుతాలూకు అనుమానంకూడా వొచ్చింది తన తలగురించి. అయినా తన ప్రయత్నాన్ని మానలేదు. ఇంక ఎంతోకాలం యిలా కునికిపాట్లు పడటం బావుండదని ఓ రోజు లక్ష్మీకాంతమ్మ వొంటరిగా ఉండటం చూసి 'నాన్దా నిన్ను ప్రేమిస్తున్నాన్' అన్నాడు. అతను ముందు ఏ భాషలో మాట్లాడుతున్నాడో తెలియక, తెలిసాక కోపమొచ్చి యిక్కడ ఒంటరిగా బావుండదని బజారులో ఓమంచి సెంటరుచూసి ఓకాలి చెప్పుతో ఫెడేల్మని కొట్టింది. కొట్టి "తలేమయినా తిరుగుతోందా? జాగ్రత్త. కీళ్లు విరిచేయగల్ను" అనేసి బేరమాడకుండా రిక్షాఎక్కి వెళ్ళిపోయింది. అసలు ఏంజరిగిందో తెలియక తేరుకుని ఏవయిందో తెలుసుకునేసరికి కళ్ళు బైర్లుకమ్మి చుట్టూ చీకటిగా అనిపించి తలతిరిగినట్లయింది. అటూయిటూ ఓమారు చూసి బావుండదని తనూ ఓ రిక్షాఎక్కి యింటికి చేరాడు. సంగతి తెలిసిన వాళ్ళనాన్న 'ఏరా తలతిరుగుడు తగ్గిందా యింకావుందా? అయినా నువ్వీ తిరుగుళ్లు తగ్గిస్తేనేగాని నీ తలతిరుగుడు తగ్గదురా! ఇంకోసారి యిలాంటి వేషాలు వేసావంటే నీచేత చెప్పులషాపు పెట్టిస్తాను' అంటూ గట్టిగా తిట్టేసరికి తలతిరిగినట్లయింది. ఎవరూ చూడకుండాచూసి ఓ స్తంభాన్ని అనుకుని గట్టిగా ఓ గంట ఏడ్చాడు. గంటయింతరువాత కళ్లు తుడుచుకుంటూ 'యింక ఏ అమ్మాయినీ తలతిప్పి చూడకూడదు' అని గట్టిగా నిర్ణయించుకుని భోంచేసి హాయిగా నిద్రపోయాడు. మళ్ళీ లేవటం లేవటం గ్రాడ్యుయేట్ అని అనిపించుకుని లేచాడు.

చదువు పూర్తిచేసి రోడ్డుమీద కొచ్చేసరికి ఉద్యోగాల తాలూకు పరిస్థితులుచూసి తలతిరిగినట్లు అయింది. ఇదిచూసి వాళ్ళనాన్న వాళ్ళకాళ్లు వీళ్ళ కాళ్లు పట్టుకుని 'తలనొప్పి, మెడనొప్పి' కంపెనీలో చేర్పించాడు.

ఉద్యోగంలో చేరిన సుబ్బారావు రెండురోజుల వరకు గమనించలేదు. మూడవరోజున వున్నట్టుండి ఎదురుగా ఒక మెరుపు మెరిసింది. వర్షంవస్తోందేవో అనుకున్నాడు. కాని ఆ మెరుపు ఒక అమ్మాయి తాలూకు అని తెలిసి తలతిరిగినట్లయింది. తేరుకుని ఆ అమ్మాయి అలా ఒంటరిగా ఉండటం బావుండదని పించి పలకరించాలని ఓ సకిలింపులాంటిది చేశాడు. అద్జూసి ఆ అమ్మాయి కోపంగా 'ఏం తలేమయినా తిరుగుతోందా?' అని అడిగింది, తెల్లబోయి తేరుకొనే లోపల ఆఫీసరు పిలిచి 'ఏవిటోయ్! తలేదో తిరుగుతోందట. మన కంపెనీముందులు వాడు. నీలాంటి వాళ్ళకోసమే తయారుచేస్తున్నాం' అంటూ కంపెనీ ధోరణిలో చివాట్లు వేశాడు. సుబ్బారావుకి మరోసారి అనుమానం వచ్చింది తలగురించి. ఇదే అనుమానం రాజారావుగారికికూడా వచ్చింది ఈ సంగతి తెలిసిన తరువాత. లాభంలేదని ఓరోజు డాక్టరుదగ్గరికి తీసు

## స ఖు గు డు

అబ్బాయి పుడితే నువ "ప్లస్"
అమ్మాయి పుట్టిందో "మైనస్"
అమ్మకానికో వరుడూ,
ఏడాదికో పురుడూ,
ఆడపిల్లల తండ్రి మనసు
కట్టింది కపడు.
వ్యాపారానికి వచ్చిన గుణకారం,
వరకట్నాలలో లేపింది దుమారం.
మధ్యావాదాన పుట్టిన దేవుడు,
పాపం ఇవన్నీ ఎరగడు.

**ఆర్. లక్ష్మణశర్మ**

కెళ్ళారు. సుబ్బారావు తలని అటూయిటూ నాలుగు సార్లు ఆడించి ఫెల్లున నవ్వేస్తూ 'మీరిలా కంగారు పడకండి. యిది ఈవయసు తిరుగుడు అంతే. పెళ్ళి చేస్తేసరి తిరుగుడు దానికదే తగ్గుతుంది. అసలు నాక్కూడా యిలాగే వుండేది. పెళ్ళయ్యాక తగ్గి పోయింది అంతే అంటూ లేచ్చేశాడు.

ఇది విని రాజారావు ఆనందంగా 'అలాగే! చాకు లాంటి సంబంధం, చాకులాంటి అమ్మాయిని తెస్తాను' అని చాకులు తయారుచేసి, సి. హెచ్. భాస్కర రావుగారి అమ్మాయిని ఖాయంచేశారు. పెళ్ళిచూపుల రోజున సుబ్బారావు అమ్మాయిని చూడగానే తెల్ల బోయాడు. ఎప్పుడూ అన్నంమొహం చూడనివాడు చూసినట్లు చూశాడు. బావుందని ఏమయినా అను కుంటారేమోనని ఓ మామూలు చిరునవ్వు నవ్వుతూ తల అటూయిటూ తిప్పాడు. అదిచూసిన వియ్యంకుడు 'అబ్బాయికేమయినా తలతిరుగుడా' అన్నారు. సుబ్బా రావుకి కోపమొచ్చింది. లేచి నుంచున్నాడు. ఏదో చెప్పబోతుంటే పెళ్ళికూతురు తండ్రి 'మీరు వెళ్ళండి ఉత్తరం రాస్తాం' అన్నారు. రాజారావు సుబ్బారావుని అక్కడోక్షణంకూడా ఉంచకుండా ఇంటికి లాక్కొ చ్చారు. చీవాట్లువేశారు. వచ్చిన మూడవరోజున ఉత్త రం వచ్చింది. అందులో 'మీ అబ్బాయికి తలతిరుగుడు అని తెలిసింది క్షమించాలి. ఈ సంబంధం చేసుకోం' అనుంది. రాజారావు కోపమొచ్చి తిట్టబోయేటంతలో మరో ఉత్తరం వచ్చింది. అందులో 'మీ అబ్బాయి మా అమ్మాయికి నచ్చాడట. మా అమ్మాయిని చూసే ఉంటారు. మొన్న పెళ్ళిచూపుల్లో పెళ్ళికూతుర్ని ఓ అమ్మాయి తీసుకొచ్చింది. ఆ అమ్మాయే మాఅమ్మాయి బస్సెక్కి త్వరగరండి. సీజనయిపోతోంది. తాంబూ లాలుచ్చుకుందాం' అని రాసుంది. అదిచూసిన రాజారావుకి తలతిరిగినట్లయింది. తేరుకునే లోపల ముహూర్తాలు పెట్టటం అయిపోయింది. అందరిలాగానే పెళ్ళి జరిగిపోయింది.

ఆరోజురాత్రి చంద్రుడు ఈ పనికే వున్నట్లు కిటికీ పక్కన చేరినవేళ అమ్మలక్కలు అలవాటుగా తలుపు సందులోంచి చూస్తున్నవేళ పద్మ అంటే నవరసుబ్బా రావు భార్య సుబ్బారావుచెవిలో గుసగుసలాడింది.

'మిమ్మల్ని ఏంచూసి చేసుకున్నానో తెలుసా?'

తెలియదన్నట్లు అలవాటుగా తల అటూయిటూ ఆడించాడు.

'ఆ తలతిరుగుడుచూసి' అంది.

ఇప్పుడు సుబ్బారావుకి నిజంగా తలతిరిగింది.